క్లుప్తంగా

ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ధర్నా



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని పీహెచ్‌సీ ఎదుట రోడ్డుపై యువజన సంఘాల నాయకులు ధర్నా చేపట్టగా, బస్టాండ్ ఆవరణలో బీజేపీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్, యువజన సంఘాల మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో ముప్పై పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ చెప్పి ఐదేళ్లు కావస్తున్న ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదన్నారు. మంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చేంత వరకు ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



అవగాహన సదస్సుకు హాజరైన రైతులు

చందుర్తి: వరి, పత్తి, మొక్కజొన్నలాంటి సంప్రదాయ పంటల సాగుతో నష్టపోయే కన్న ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలను గడించవచ్చునని ఇన్‌చార్జి వ్యవసాయాధికారిణి ప్రణీత అన్నారు. మండలంలోని మర్రిగడ్డ రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయిల్ పామ్ క్లస్టర్ అధికారి శేఖర్ మాట్లాడారు. తక్కువ నీటి వసతితో ఆయిల్ పామ్‌ను సాగు చేసుకోవచ్చునన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే ఎస్సీ, ఎస్టీ 100 శాతం సబ్సిడీ, బీసీలకు 90 శాతం, ఓసీలకు 80 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం కుమార్, రైతు బంధు కోఆర్డినేటర్ దారం బాల్‌రెడ్డి, ఎంపీటీసీ గణేశ్, ఏఈవోలు శిరీష, దీపిక, శ్వేత, సింగిల్‌విండో డైరెక్టర్ నాగం శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న లక్ష్మీరాజం

సిరిసిల్లఅర్బన్: మహిళలు, బాలికలు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు బాబాజీనగర్, వేములవాడలోని చెక్కపెల్లిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, బాలికలు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు, యువతులు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు షీటీమ్, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై వివరించారు. సీడీపీవోలు అలేఖ్య, ఎల్లయ్య గౌడ్, కౌన్సిలర్ సత్యనారాయణ, చెక్కపల్లి సర్పంచ్ జైపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్ దివ్య, సుచరిత అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పూర్తయినా ప్రారంభించరా.?

- రూ.2.70 కోట్లతో నిర్మించిన కూరగాయల మార్కెట్
- ఇబ్బందిపడుతున్న వ్యాపారులు



ప్రహరీపై కూరగాయల సాగు చిత్రాలు



మార్కెట్ భవనంలో ప్లాట్‌ఫాంలు



ప్రారంభానికి సిద్ధంగా భవనం

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలో ఏళ్లుగా కూరగాయాల మార్కెట్ భవనాలు లేక చిరు వ్యాపారులు రోడ్లపై కూరగాయాలను అమ్ముకుంటున్నారు. ఎండకాలం, వర్షాకాలం వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో పట్టణంలోని ఉప్పుగడ్డ వీధిలో కూరగాయాల మార్కెట్ ఉండేది. ఇరుకు సందులతో ఇబ్బందిగా జనాలు తాకిడి ఎక్కువగా ఉండేది. కరోనా కాలంలో కూరగాయాల మార్కెట్‌ను వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీకి తరలించారు. ధాన్యం కొనుగోళ్లు మార్కెట్ కమిటీలో ప్రారంభించడంతో కూరగాయాల వ్యాపారులకు ఇబ్బందిగా మారింది. అక్కడి నుంచి వేములవాడ మూలవాగు ఒడ్డున రెండో బైపాస్ రహదారి పక్కన కూరగాయాల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. కొందరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు రహదారికి ఇరువైపుల కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. దాంతో ఇప్పటికి కూడా ఆ కూరగాయాల మార్కెట్‌లు అక్కడే కొనసాగుతున్నాయి.

రూ.2.70 కోట్లతో నిర్మాణం

రైతులు, వ్యాపారులు కూరగాయలు అమ్ముకునేందుకు వీలుగా వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో అధునాతన వసతులతో పట్టణంలోని భగవంతరావునగర్‌లో మార్కెట్ భవనం నిర్మించారు. మున్సిపల్ నిధుల నుంచి రూ.2.70 కోట్లతో పది వేల అడుగుల విస్తీర్ణంలో 102 మంది ఒకేసారి కూర్చుని వ్యాపారం చేసుకునే విధంగా స్టాల్స్‌తో కూడిన భవనాన్ని నిర్మించారు. అలాగే మరుగుదొడ్లు, గదులు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, మిగిలిన కూరగాయలను భద్రపరుచుకునేందుకు శీతల గోదామును కూడా ఏర్పాటు చేశారు. రైతులు వ్యాపారులు ఎండకు ఎండి వానకు తడవాల్సిన పనిలేకుండా ఎంతో సౌకర్యంగా ఉంది. ఈ భవనంలో కూరగాయలు, పండ్లు, పూలు మాత్రమే అమ్ముకునే వారు. మూడు నెలల క్రితం పనులు పూర్తిచేసి మార్కెట్ భవనం ప్రారంభిస్తామని హడవిడి చేసిన అధికారులు ఇప్పటి వరకు ప్రారంభించలేదు. ఇప్పటికైనా ఈ భవనాన్ని ప్రారంభించాలని వ్యాపారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



బైపాస్ రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతుంటే ఎండలకు ఇబ్బందిగా మారింది. నూతనంగా నిర్మించిన మార్కెట్ భవనం త్వరగా ప్రారంభించాలి.

– మహేశ్, కూరగాయల వ్యాపారి, వేములవాడ

జూన్‌లో ప్రారంభిస్తాం



అన్ని వసతులతో కూడిన కూరగాయల మార్కెట్ భవనం పనులు పూర్తయ్యాయి. కాని పార్కింగ్ కోసం రేకుల షెడ్లు, పక్కన మొక్కలు ఏర్పాటు చేస్తున్నాం. జూన్ మొదటి వారంలో ప్రారంభిస్తాం.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

సమాచారం

పారా అథ్లెట్ల నుంచి దరఖాస్తుల స్వీకరణ

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ రాష్ట్ర క్రీడా ఆదేశాల మేరకు జిల్లాలోని దివ్యాంగులైన అథ్లెట్లు, పారా అథ్లెట్ కోచ్‌లు, శిక్షణ పొందుతున్న దివ్యాంగ అథ్లెట్ల నుంచి పారా విభాగాల్లో ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖాధికారి ఉపేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 20 లోపు జిల్లా యువజన క్రీడాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పిల్లల ఆరోగ్యంతో ఆటలాడొద్దు

సిరిసిల్లటౌన్: జిల్లాలో కొందరు పిల్లలకు ఎక్కువ డోసులు ఇస్తూ వారి ఆరోగ్యంతో ఆటలాడుతున్నారని సీపీఎం కార్యదర్శి మూశం రమేశ్ ఆరోపించారు. మంగళవారం పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా ప్రవర్తిస్తున్నారని వారిపై జిల్లా వైద్యాధికారి చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఆస్పత్రులను సీజ్ చేయాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, ఎలిగేటి రాజశేఖర్, రమేశ్‌చంద్ర పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

వేములవాడరూరల్: వేములవాడ గాయత్రీ బ్యాంకులో బొల్లి రవీందర్ అనే ఖాతాదారుడు ప్రమాదవశాత్తు మరణించగా ఆయన కుటుంబసభ్యురాలైన బొల్లి అంజవ్వకు రూ.లక్ష ప్రమాద బీమా చెక్కును బ్యాంకు సిబ్బంది మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిచేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం వంశీకృష్ణ, బ్రాంచి మేనేజర్ గజేంద్ర, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే క్రీడా పోటీలు

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

కోనరావుపేట: మట్టిలో మాణిక్యాలను వెలికితీసే ఉద్దేశ్యంతోనే క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. కోనరావుపేటలో సీఎం కప్ 2023 క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య, సర్పంచ్ రేఖ, ఎంపీటీసీ చారి, సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రాంమోహన్ రావు, ఎంపీడీవో రామకృష్ణ, అగ్రహారం ఆలయ డైరెక్టర్ తాళ్లపెల్లి సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

బోయినపల్లి: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్ మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేణుగోపాల్, తహసీల్దార్ నరేశ్, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ లతశ్రీ, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, పీడీ సీహెచ్ సంపత్‌రావు, పీఈటీ సంతోష్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని చెక్కపల్లి గ్రామంలో ప్రభుత్వం నిర్వహించే సీఎం కప్ క్రీడలను ఎంపీపీ బండ మల్లేశంయాదవ్ మంగళవారం ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ రమేశ్, ఎంపీవో శ్రీధర్, పీఈటీలు రాజశేఖర్, జ్యోతి పాల్గొన్నారు.

నిరుపేద క్రీడాకారులకు చేయూతనందించాలి

చందుర్తి: నిరుపేద క్రీడాకారులకు ప్రభుత్వం ఆర్థిక చేయూతను అందించి, వారిని ప్రోత్సాహించాలని జెడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. చందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడల ప్రారంభోత్సవానికి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు కమలాకర్, ఎంపీటీసీ గణేశ్, తహసీల్దార్ మజీద్, ఎంపీడీవో పత్తి రవీందర్, ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సిరిసిల్లఅర్బన్: మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని మినీ స్టేడియంలో మంగళవారం సీఎం కప్ 2023 క్రీడా పోటీలను మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ప్రారంభించారు. క్రీడాకారుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు సీఎం కప్ పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాపెల్లి అరుణ, పీఈటీలు సాన బాబు, రవిందర్, రజిత పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల స్థాయి సీఎం కప్ 2023 పోటీలను ఎంపీపీ బూర వజ్రమ్మ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు, సర్పంచులు వెంకటరమణారావు, కదిరె రాజుకుమార్, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఐకేపీ వీవోఏల నిరసన



వేములవాడలో నిరసన తెలుపుతున్న వీవోఏలు

వేములవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఐకేపీ వీవోఏలు చేపడుతున్న నిరసన మంగళవారం 11వ రోజుకు చేరింది. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన వీవోఏలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసనలో పాల్గొన్నారు. వీరికి అన్ని పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకు తమ ఆందోళన ఆగేది లేదని వారు అంటున్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీవోఏలు పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన

చందుర్తి: తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలంటూ స్థానిక ఐకేపీ కార్యాలయం ఆవరణలో ప్లకార్డులతో వీవోఏలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీవోఏ మండల సంఘం అధ్యక్షురాలు స్వరూప, మండల ప్రధాన కార్యదర్శి వినోద, వీవోఏలు స్వప్న, రజిత, పద్మ, సువర్ణ, బాబాయి, లావణ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వీఆర్ఏ, వీఓఏల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏలు

బోయినపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలని మండల వీఆర్ఏలు, వీఓఏలు వేర్వేరుగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అర్హులైన వీఆర్ఏలకు పేస్కేల్, 55 ఏళ్లు నిండిన వీఆర్ఏల కుటంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో చేసిన ప్రకటన అమలు చేయాలని వీఆర్ఏలు కోరారు . వేతనం పెంచాలని, ప్రమాద బీమా రూ.ఐదు లక్షలు కేటాయించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఎమ్మెల్యేకు అందించారు. మండల వీఆర్ఏలు యాద రవీందర్, చాంద్‌పాషా, వూదరి రమేశ్, అమ్ముల శ్రీనివాస్, జలేందర్, చందు, శ్రీలత, శోభ, షర్మిల, మాధవి మండల వీఓఏలు ఉన్నారు.

డెంగీ నివారణ అవగాహన ర్యాలీలు



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్లారెడ్డిపేట ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ముస్తాబాద్ మండలంలోని పోతుగల్‌లో వైద్యాధికారి గీతాంజలి ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట పీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ బాబు మాట్లాడుతూ డెంగీ బారిన పడకుండా ఇంటి పరిసరాలు, కుండలు, పాతటైర్లు, కొబ్బరిబొండాలు, కూలర్లలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. నివారణ ఒక్కటే మార్గమన్నారు. సర్పంచ్ గౌతంరావు, ఎంపీటీసీ బాలకిషన్, హెచ్ఈవో యాదగిరి, కోల పర్శరాములు, రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్తంభం నిలబడింది

సాక్షి ఎఫెక్ట్



చందుర్తి: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గాలిపెల్లి రాజయ్య అనే రైతు పొలంలో విద్యుత్ స్తంభాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. 'రైతు గోడు వినిపించుకోరా.' అనే శీర్షికన ఈ నెల 12న ప్రచురితమైన వార్త కథనానికి సెస్ అధికారులు స్పందించారు. ఎట్టకేలకు విద్యుత్ స్తంభాన్ని వేసి విద్యుత్ తీగలు బిగించారు. దీంతో 25 రోజులుగా విద్యుత్ సరఫరా కాక ఇబ్బంది పడ్డ రైతుకు విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయడంతో కష్టాలు తీరాయి.

నిరుద్యోగులకు సర్కారు ప్రోత్సాహం



స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: నిరుద్యోగులు, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. మంగళవారం సిరిసిల్ల ఎస్సీడీవో ఆధ్వర్యంలో పోటీ పరీక్షల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేయడానికి నోటిఫికేషన్లు వెలువడ్డాయని నిరుద్యోగులు అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. శిక్షణలో పాల్గొన్న నిరుద్యోగులకు స్టడీమెటీరియల్‌ను అందజేశారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ స్వప్న, ఏఎస్‌డబ్ల్యూవో రామచంద్రం, జిల్లా మైనార్టీ శాఖ అధికారి సర్వర్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

కొద్ది రోజుల క్రితం నీటి ప్రమాదంలో మృతిచెందిన స్థానిక 22వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త భార్య గున్నాల ఉమకు రూ.2 లక్షల బీమా చెక్కును అందించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సిరిసిల్లక్రైం: తంగళ్లపల్లి మండలం మండెపల్లికి చెందిన యారబంటి శ్రీనివాస్ గత నెల 22న తన అవసరాల నిమిత్తం సిరిసిల్ల వచ్చి పాతబస్టాండ్‌లో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీనిపై బాధితుడు ఫిర్యాదు మేరకు నూతన సాంకేతిక విధానాన్ని ఉపయోగించి దర్యాప్తు చేసి సెల్‌ఫోన్ పట్టుకుని, బాధితుడికి మంగళవారం అప్పగించినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

కంటి వెలుగు ప్రారంభం



ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ వేణు

సిరిసిల్లటౌన్: మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో కంటివెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, కౌన్సిలర్లు అరుణ, జాగీరు శైలు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని నర్సక్కపేట, ఓబులాపూర్ గ్రామాల్లో కంటివెలుగు కార్యక్రమాన్ని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు శిరీష, మల్లవ్వ, ఎంపీటీసీ పట్నం అశ్విని, ముత్యం రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కోనరావుపేట: సిరిసిల్ల మండలం చంద్రంపేట గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన ఎగమంటి అనిల్(22) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. సిరిసిల్లలో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా, అనిల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో సిరిసిల్లకు ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.

అగ్నిప్రమాదంలో పశుగ్రాసం దగ్ధం

కోనరావుపేట శివారులో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని 50 ఎకరాల మేర పశుగ్రాసం దగ్ధమైంది. పొలాల్లో ధాన్యాన్ని కోయగా మిగిలిన గడ్డి పొలాల్లోనే ఉండగా ఈ ప్రమాదం జరిగింది.

స్పీడ్ బ్రేకర్స్ తొలగించండి

సిరిసిల్లటౌన్: ప్రధాన రహదారిలపై స్పీడ్‌బ్రేకర్స్‌ను తొలగించాలని కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజుఆర్‌అండ్‌బీ అధికారులకు మంగళవారం వినతిపత్రాన్ని అందించారు.

అంగన్‌వాడీలకు అద్దె భవనాలే దిక్కు

- అసంపూర్తి నిర్మాణాలు
- 19 కేంద్రాలకు భవనాలు లేవు
- 3,099 చిన్నారుల విద్యాభ్యాసం
- అద్దె భవనాలు, పాఠశాలల్లో నెట్టుకొస్తున్న వైనం



ఎల్లారెడ్డిపేటలో అసంపూర్తిగా భవనం



రాగట్లపల్లిలో పిల్లర్లకే పరిమితమైన భవనం

ఎల్లారెడ్డిపేట: చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పేందుకు గూడు లేక వారు ఇబ్బంది పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు సమకూర్చేందుకు ప్రభుత్వం అసంపూర్తిగా నిధులు మంజూరు చేయడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా విద్యార్థులు, టీచర్లు అవస్థలు పడుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో 24 గ్రామపంచాయతీల్లో 46 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 27 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, 19 కేంద్రాలను అద్దె భవనాలు, పాఠశాలల్లో నడిపిస్తున్నారు. ఎనిమిది భవనాలు స్లాబ్, రూఫ్ లెవల్‌లో ఉన్నాయి. ఏళ్ల తరబడి వీటిని పూర్తి చేసేందుకు నిధులు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. చిన్నారుల మాత్రం సరైన వసతులు లేక అవస్థల మధ్య కాలం వెల్లదీస్తున్నారు.

అసంపూర్తిగా నిర్మాణాలు

మండలంలో 46 కేంద్రాలుండగా 27 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. మరో 19 భవనాలకు ఎనిమిదేళ్ల క్రితం ఒక్కొక్క భవనానికి రూ.8.50 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. మంజూరైన నిధులతో పనులు ప్రారంభించారు. ఆరున్నరేళ్లుగా పనులు జరుగుతున్నా పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాని కారణంగా నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఒక్కొక్క భవనం స్లాబ్, రూఫ్ లెవల్, బేస్‌మెంట్ వరకు వచ్చినప్పటికీ వాటిని పూర్తిచేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎనిమిది నిర్మాణాలు అసంపూర్తిగా ఉండగా మరో 11 స్లాబ్, బేస్‌మెంట్ లెవల్ వరకే పరిమితమయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని వసతులు కల్పిస్తామని పాలకులు ఇస్తున్న హామీలు కాగితాలకు పరిమితమయ్యాయి. నిధులు పూర్తిస్థాయిలో మంజూరైతే నిర్మాణాలు పూర్తయ్యే అవకాశం ఉంది.

ఇరుకు గదులతో ఇబ్బందులు

మండలంలోని 19 కేంద్రాలకు భవనాలు లేక అద్దె భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కేంద్రాలను కొనసాగిస్తున్నారు. సరైన వసతులు లేక విద్యార్థులు ఇరుకు గదులతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో ఈ ఇరుకు గదులలో చిన్నారులు పడుతున్న బాధలు చెప్పనలవి కాదు. అద్దె భవనాల్లో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అద్దె భవనాలు, పాఠశాలల్లో అరకొర వసతుల మధ్య కేంద్రాలను నెట్టుకొస్తుండగా, ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న భవనాలను అన్ని వసతులతో అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

పిల్లలకు ఇబ్బంది



అద్దె భవనాలు, అసంపూర్తి నిర్మాణాలతో కేంద్రాలకు వచ్చే చిన్నారులు అరకొర వసతులతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం అధికారులకు విన్నవించాం. అన్ని వసతులతో భవనాలు అందుబాటులోకి వస్తే విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుంది. కొన్నిచోట్ల తొందరగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

– మోతే సరిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్